
కథానిక

# భయం



కె.కె. మీనన్

సుద్దుల పద్దయ్య అసలు పేరేమో గాని అతను గొల్లసుద్దులం చెప్పటం వల్ల ఇంటి పేరు 'సుద్దులు'గా ముద్దుర పడిపోయింది. అతను ఎక్కడి వాడో తెలీదు గాని, అక్కడికి వచ్చిన ముహూర్తం మాత్రం చాలా గొప్పదనే చెప్పాలి. ఎంచేతనంటే అతన్ని ఆ వూళ్ళో అభిమానించని వ్యక్తి లేడు. రెండోది. అతను గొల్ల సుద్దులు చెప్పి పొట్ట నింపుకోవడమే గాక కాస్తో కూస్తో పొలం కూడా సంపాదించుకున్నాడు. (కళ వల్ల సాధ్యం కానిది) అది పద్దయ్య పొదుపు వల్లనేగాని కళ ప్రభావం కాదనే అభిప్రాయం కూడా వుందనుకోండి. అది వేరే విషయం.

ఆ సుద్దుల పద్దయ్య ఏకైక పుత్రుడే సుద్దుల మల్లయ్య. సుద్దులు తనకు కూడు పెట్టినా, కొంతలో కొంత కూడ బెట్టినా కొడుకు మల్లయ్య మాత్రం తనూ సుద్దులు చెప్పకు బతకరాదని పద్దయ్య కోరిక. అతను పెద్ద చదువులు చదువుకోవాలనీ, పెద్ద ఉద్యోగం చేస్తే మూడాలనీ పేరాస పడేవాడు పద్దయ్య. పద్దయ్యకు చదువుపైన వుండే మమకారం, కొడుకు గొప్పవాడు కావాలనే తాపత్రయం మల్లయ్యని మల్లేశ్వరావుగా మార్చిందే గాని చదువు మాత్రం ఒంటబట్టలేదు. అందుకు కారణం అతని తెలివి తక్కువ తనమూ కాదు. చదువు పట్ల శ్రద్ధ లేకపోవటమూ కాదు. అతను కాలేజీలో చదివిన కాలం అలాంటిది. కమ్యూనిస్టు ఉద్యమ ప్రభావం ముమ్మరంగా అల్లుకుంటోన్న రోజులు. విద్యార్థి ఉద్యమాలు సామాజిక స్థితి గతులవైపు మొగ్గు చూపుతోన్న రోజులు. అంచేతనే కడుపు కూటికి మార్గాలు వెతుక్కుంటూ కాలేజీనే పట్టుకు వేళ్లాడలేక పోయేడు. కాలేజీ కేంపస్ వదిలి ప్రపంచం వైపు పరుగులు తీసేడు. జైలు వాసం చేసేడు. లాఠీ దెబ్బలు తిన్నాడు. నది ఉరుకులూ పరుగులూ మాని సముద్రంలో కల్సి ప్రశాంతంగా వున్నట్లు ప్రస్తుతం వూళ్లో స్థిర పడ్డాడు మల్లేశ్వరరావు.

* * *

రక్తంలో అగ్నికణం వుండాలే గాని అది ఎప్పుడో అప్పుడు భగ్గున మండి మంటలు రేపక మానదు. అతని రక్తంలోని అగ్నికణం ఎన్ని సార్లు భగ్గుమండో ఎన్ని వుద్యమాలనీ వుద్రిక్తతల్నీ లేపిందో మనకి అప్రస్తుతం. ప్రస్తుతం మల్లేశ్వరావు ఊగి పోతున్నాడు. అగ్గిమీద గుగ్గిలంలా మండిపోతున్నాడు. కొడుకు మనసెరిగిన తల్లి ఏం మూడిందోనని భయపడి వూరిఫీద పడింది. మధ్యలో సుబ్బిగాడు తగిలేడు.

"మల్లిగాడు ఏం జేత్తన్నాడు పెద్దమ్మా?" అనడిగేడు.

"ఏం జేత్తాడో ఏమో! కారాలూ మిరియాలూ నూర్తన్నాడు పొద్దున్నుంచే" అన్నది ముసిల్ది.

సుబ్బిగాడు వెళ్ళేప్పటికి కారాలూ మిరియాలూ కాదు గాని, కత్తినూర్తున్నాడు మల్లేశ్వరావు.

"ఏంత్రా మల్లీ అంత అడావుడిగా కత్తి నూర్తన్నావు?" అనడిగేడు.

మల్లేశ్వరావు మాట్లాళ్ళేదు. ఒకసారి సుబ్బిగాడి వైపు చూసేడు. అతని కళ్ళు చింత నిప్పల్లా కణకణ లాడ్తున్నాయి. తెల్లటి మొగం జేగురు రంగుగా మారిపోయింది. అపర నరసింహావ తారంలా వున్న అతన్ని చూసి హడిలిపోయేడు సుబ్బిగాడు. మిత్రుడి సంగతి అతనికి బాగా తెల్సు. ఆ రోజు ఎవరికి ఏం మూడుతుందోనని భయపడి పోయేడు సుబ్బిగాడు.

"ఏంటిరా మల్లీ ఏమైంది?" అనడిగేడు మళ్లీ.

కత్తి నూరటం మాని

"నీకు చెప్పాలా?" అనడిగేడు అతని ముఖంలోకి సూటిగా చూస్తూ.

"చెప్పమనేగదా?"

"నీకు చెప్పినా ఒకటే కుక్కకీ నక్కకీ చెప్పినా ఒక్కటే"

"పోనీలే! నేను కుక్కనో, నక్కనో అనుకో ఏం జరిగిందో చెప్ప"

"నీకు జరిగిన అవమానానికి నాకైతే నిద్ర పట్టడం లేదు గాని, నువ్వు మాత్రం హాయిగా తిని నిద్రపోతున్నావు"

"నాకేమయింది?" అని ఆశ్చర్యంగా అడిగేడు సుబ్బిగాడు.

"ఓహో, అప్పుడే మర్చిపోతేవా? అవున్లే! మన జాతి లక్షణమే అంత. తిట్టినా కొట్టినా మర్నాడే మర్చిపోతాం. ఉమ్మేస్తే తుడుచుకు వెళ్ళిపోతాం. అయినా నీకు మచ్చలు వీపు మీద కదా వున్నది. కన్పించవులే!!"

సుబ్బిగాడు నిట్టూర్చేడు. తనకు జరిగింది అవమానం అని సుబ్బిగాడు ఎరగడు. ఏదో చిన్న దొంగతనం చేసేడు. అందుకు శిక్ష అనుభవించానని అనుకుంటు న్నాడేగాని దొర వీపు పగలగొట్టి గాయాలకి ఆవగాయ వూట రాయించింది అతడు అవమానంగా భావించలేదు. అది తన ఒక్కడికే జరిగింది కూడా కాదు. తను ఎరిగినప్పట్నుంచీ జరుగుతూనే వుంది. ఊళ్లో వున్న పేదా సాదా అందరూ దొర దగ్గర చాకిరీ చేస్తున్న వాళ్లే, కాస్తో కూస్తో పొలంలోంచి చాటు మాటున తెచ్చుకుంటు న్నవాళ్లే. అందుకు ఈ మాదిరి శిక్షలు తప్పటం లేదు. అయినా మర్చిపోయి దొరగారి పొలంలో ఎవరి పన్లు వాళ్లు చేసుకుంటూనే వున్నారు. కాని ఈ శిక్ష ఇంత ఘోరమైంది, అమానుషమైందీ అని ఒక్కరూ భావించి ఎరగరు. ఏదో దొరలు ఇంత తిండి పెడ్తున్నారు. వాళ్లు తిట్టినా కొట్టినా భరించాలి అని మాత్రమే అనుకునే వారు. సుబ్బిగాడిది కూడా అదే అభిప్రాయం.

"తప్పు చేసాను గదా మరి!" అన్నాడు మెల్లిగా.

"ఏవిట్రా నువు చేసిన తప్పు?"

"కొబ్బరి కాయ దొంగతనం చేయటం తప్పుగాదా మరి?"

"ఒక్క కొబ్బరి కాయ. మహా అయితే దాని ఖరీదు ఒక్క రూపాయి. కాని నీకు వేసిన శిక్ష? భరించ రానిది. వెలకట్టలేనిది. అభిమానాన్ని రూపాయి పైసలతో విలువ కట్టలేవు"

"ఎంతయినా దొంగతనం దొంగతనమేగా?"

"కావచ్చును. నువు తెచ్చుకున్న రూపాయి విలువ కొబ్బరి కాయనే దొంగతనం అని అనుకుంటున్నావు. కాని ఎంత విలువైన నీ శ్రమని వాడు దొంగిలిస్తున్నాడో. నీకు తెల్సునా? అసలైన దొంగవాడు. నువ్వు కాదు"

"అదెలాగ?" అనడిగేడు అమాయకంగా.

"భేష్... ఎలాగని అడుగుతున్నావు. చాల సంతోషం. అపలదీ అడక్కుండా, అడిగి తెల్సుకుందామనే జిజ్ఞాస లేకుండా తమకు తాము అర్పితం అయిపోయే మన అలగా జనం అనేక మంది వున్నారు. వాళ్ళలో నువ్వూ ఒకడివి కానందుకు ఆనందమే. అయితే విను మరి చెప్తాను..."

"... ..."

"నువు రోజూ పన్లోకి ఎప్పుడు వెళ్తావు?"

"కోడి కూసాక"

"తిరిగి ఇంటికెప్పుడొస్తావు?"

"చీకటి పడ్డాక"

"ఇలా నెల ముప్పై రోజులూ చేసే చాకిరీకి నీకు ముట్టే జీతం ఎంత?"

"రెండు బస్తాల ధాన్యం"

"నీకిచ్చే రెండు బస్తాల ధాన్యం. నీవు పనిచేసే పది రోజుల శ్రమ విలువకి మాత్రమే సమానం. నెల రోజులు నువు పొలంలో పని చేస్తే ఆరు బస్తాల ధాన్యానికి సమానమైన శ్రమ కర్చవుతుంది. కాని నీకు ముడుతున్నది పది రోజుల శ్రమ వేతనం మాత్రమే. అంటే ఇరవై రోజుల నీ శ్రమని జమిందారు దొంగిలిస్తున్నాడన్నమాట! ఇలా మన శ్రమని దోచుకునే వాళ్లు ధనవంతులవవుతున్నారు. మనం మరింత పేదవాళ్లమవుతున్నాం. ఇప్పుడు చెప్పు. ఎవడు దొంగ?"

"అమ్మో! ఇందులో ఇంత తిరకాసుందా?" అని నోరు వెళ్ళబెట్టేడు సుబ్బిగాడు.

"అంతేకాదు. అప్పుడప్పుడూ నీ పెళ్ళాం పిల్లలు చేసే ఉచిత చాకిరీ కూడా వుంటుంది. ఇది శారీరకమైన దోపిడీ. వాళ్ళు మానసికంగా కూడా మనల్ని దోచుకుంటున్నారు. మనల్ని ఎప్పుడు వాళ్ళు పేరు పెట్టి పిలవరు. 'ఒరే' అనో లేక పేరుకి వెనక 'గాడు' చేర్చో గాని పిలవరు. మన పెళ్లాల్నీ పిల్లల్నీ 'ఏమే' అని తప్ప పేరు పెట్టి పిలవరు. వాళ్ల కుక్కల్ని పేరు పెట్టి పిలుస్తారు. కాని మనకీ పేర్లున్నాయని మర్చిపోతారు. ఇలా పోగొట్టు కుంటోన్న అభిమానానికి విలువ కట్టగలవా?"

"... అంచేత నువు చేసింది దొంగతనం కానే కాదు. అయినా చేయని దొంగతనానికి శిక్ష అనుభవించేవు. ఇది అక్రమం, అన్యాయం అంటాన్నేను"

"నేనూ అంటాను. కాని మనం చేయగలిగింది ఏవిటి చెప్పు?"

"ఎందుకు చేయలేం? తల్చుకుంటే ఏమైనా చేయగలం. కనీసం నువు చేసింది దొంగతనం కాదు. నీకు రావల్సిన దాంట్లో కొంత తీసుకునే ప్రయత్నం మాత్రమే అవైనా చెప్పగలవో. కాని చెప్పవు. జరుగుతున్న అన్యాయాన్ని ఎదిరించవు. తిరగబడవు. అందుకే వాళ్ల ఆగడాలకి అంతులేకుండా పోతోంది..."

"... నేను మాత్రం ఈ అక్రమాల్ని సహించను. ఇవాళ అటో ఇటో తేల్చేస్తాను" అన్నాడు మల్లేశ్వరావు తీక్షణంగా.

"అంటే..."

"ఇన్నాళ్లనించే మన వీపులు పగల గొట్టిన ఆ వెయ్యినరికేస్తాను. ప్రతి మంచి పనికీ ఒక బలి తప్పదంటారు. అవసరం అయితే ఉరికంబమెక్కి హాయిగా ప్రాణాలర్పిస్తాను. అంతేగాని వాణ్ని ప్రాణాలతో ఒదల్ను."

ఆ మాటలు పూర్తికాక ముందే లేచి పరుగెత్తేడు సుబ్బిగాడు.

"అయ్యబాబోయ్! ఆళ్ల దగ్గిర తుపాకులున్నాయి బాబో. మల్లిగాణ్ని కాల్చి సంపేత్తారు బాబో..." అంటూ దారి పొడుగునా అరుస్తూ పరుగెత్తేడు.

* * *

మిట్ట మధ్యాహ్నం దొరగారి బంగ్లా దొడ్లో, గాదెల వాకిట్లో ఎండ చిట పట లాడే సమయం.

మండుటెండలో మనిషిని నిలబెట్టి వీపు మీది చర్మం చినిగి పోయేలా ఓకు తోకతో చితకబాది ఆ గాయాల మీద ఆవగాయ వూట పూస్తే ఎంత నరకమో వూహించు కుంటున్నాడు మల్లేశ్వరావు.

బయటి నించి పిలుపు వచ్చింది.

జమిందారు మోచేతి నీళ్లు తాగే ముగ్గురు బంట్లు అతన్ని తీసుకు పోయేందుకు వచ్చేరు.

మల్లేశ్వరావు ఇంట్లోకి వెళ్లేడు. పంచె బిగించి కట్టుకున్నాడు. కత్తి చర్మం తొడుగులో పెట్టి మొలలో పెట్టుకున్నాడు. కనబడకుండా పొడుగు చొక్కా వేసుకుని వాళ్ల వెంట వెళ్ళేడు.

అలవాటు ప్రకారం అందరూ దొరగారి కోర్టులో హాజరై వున్నారు. చెక్క కుర్చీమీద గుమాస్తా పంతులు కూర్చొని తీర్పు చెప్పేందుకు సిద్ధంగా వున్నాడు. పక్కన బల్లమీద మరో పది మంది వూ॰ మోతుబరులు చుట్టలు వెలిగించుకుని వినోదం చూసేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు.

మల్లేశ్వరావు వచ్చి నిలబడ్డాడు.

అందరిలా అతని ముందున్న పెద్దలకు చేతులెత్తి దణ్ణం పెట్టలేదు. దీనంగా ముఖం పెట్టి వారి దయకోసం యాచించలేదు. వీరుల్లా నిర్భయంగా నిల్చున్నాడు. ముద్దాయి ఆ ముఖాలు చిన్నవీ కళ్లు ఎర్రవీ చేసుకున్నాడు.

మల్లేశ్వరావు చలించలేదు.

ఎదురుగా ఖాళీ కుర్చీ వుంది. పక్కన పొడుగాటి ఓకు కొరడా, పెద్ద గిన్నెలో ఆవగాయ వూట సిద్ధంగా వున్నాయి.

"అయ్యగారెందుకో ఇంకా ఆసనం స్వీకరించలేదు" అనుకున్నాడు మల్లేశ్వరావు.

పంతులు విచారణ ప్రారంభించేడు.

"ఏరా మల్లిగా..." అంటూ మొదలెట్టేడు.

"నా పేరు మల్లేశ్వరావు. ఆ పేరుకు ముందు 'ఏరా' అని గాని, వెనక 'గాడు' అని గాని చేరిస్తే నేను సహించను. మరో సారి అలా పిలిస్తే, 'ఏరా పంతులూ' అని నిన్ను కూడా పిలవాల్సి వస్తుంది" అన్నాడు.

పంతులు రావడిపోయేడు. వీపు మీద పట పటా ఫేము బెత్తంతో వాయించేసినట్లని పించింది. కాస్సేపటి వరకూ పళ్ళ కొరుకుతూ ఏమీ మాట్లాళ్లేక పోయేడు.

అయినా ఇంకెంత సేపులే! కాగల పని గంధర్వులే చేస్తారు, అని సరిపెట్టుకుని

"కొబ్బరి కాయలు తీసేవా?" అనడిగేడు.

"లేదు. తీయటానికి ప్రయత్నించాను."

"కాని, ఇంతలోనే మా మనుషులు..."

"మీ మనుషులు కాదు. దొరగారి మనుషులు"

"ఆ... అదే... వాళ్లు పట్టు కున్నారు. అవునా?"

"అవును"

"అందుకు శిక్ష ఏవిటో తెల్సా?"

"దొంగతనం చేస్తే శిక్షేవిటో తెల్సు. చేయటానికి ప్రయత్నిస్తే ఏవిటి శిక్షో ఇప్పుడు తెల్సుకోవాలి"

"దానికీ అదే శిక్ష..." అని సాధ్యమైనంత కటువుగా అనేందుకు ప్రయత్నించేడు పంతులు. కాని పలుకులు మాత్రం సాధువుగానే వచ్చేయి.

"ఊ... చొక్కా విప్పేయండ్రా"

ఎనుబోతుల్లాంటి ముగ్గురు మనుషులు ముందుకు వచ్చేరు.

"ఆగండి..."

అని బంగ్లా లోపల్నుంచి విన్పించింది.

"పంతులుగారూ... అతన్ని వెళ్ళిపొమ్మనండి."

"అది చిన్న దొరగారి గొంతుకేనా" అని కాస్సేపు అనుమాన పడ్డారు అక్కడి పెద్ద మనుషులు. అవునని తేల్చుకున్నాక ఆశ్చర్య పోయేరు. టికెట్టు లేకుండా సినిమా చూద్దామని వస్తే కరెంటు పోయినట్లయింది వాళ్లకు.

"అయ్యా..." అంటూ మొదలెట్టేడు పంతులు.

"ఆపండి మీ వాదన. అతన్ని వెళ్లిపొమ్మనండి."

ఈసారి కొంచెం కటువుగా విన్పించేయి మాటలు. అది ఆజ్ఞ. తిరుగులేని ఆజ్ఞ.

అటే చూస్తూ నుంచున్నాడు మల్లేశ్వరావు.

మాటలే గాని మనిషి ముందుకు రావటం లేదు.

"ఊ... వెళ్లమనండి..."

విన్పిస్తూనే వుంది. వెళ్లమని చెప్పాల్సిన అవసరం లేక పోయింది పంతులికి.

ఒక్కసారి అందరివైపూ చూసేడు మల్లేశ్వరావు. కడసారిగా దొరగారి ఖాళీ కుర్చీ వైపు కూడా చూసేడు. అందరికీ విన్పించేలా–

"చిన్న దొరా... బతికి పోయావు" అంటూ బయటికి వెళ్లిపోయాడు.

ఆ న్యాయ స్థానానికి అదే ఆఖరి రోజు.

# బీర్ తాగితే ప్రమాదం లేదా?

చాటుగా మద్యాన్ని తీసుకునే స్థాయి నుండి, మన సామాజిక సభ్యతలూ, సాంఘిక మర్యాదలూ ఎంతో ఎదిగి పోయేయి. కాఫీ, టీలను సేవించినంత అలవోకగా ఆల్కహాళ్ళను తాగుతున్నారు. తమ బృందంలో బిడియస్థులెవరైనా వుంటే బీరన్నా తాగమని బలవంతం చేసే మిత్రులున్నారు. వీరి దృష్టిలో బీర్ తీసుకోడం మద్యపానం లెక్కలోకి రాదు. విస్కీ, రమ్, జిన్ లాంటి ఘాటైన ద్రవాల్ని సేవించే వాళ్లలో బీర్ ఒక సాధారణ, సజ్జన ద్రావకమనే అపోహ వుంది.

మెదడులో వున్న సున్నితమైన కణాల్ని నాశనం చేసే శక్తి విస్కీతో బాటు, మనం ఫర్వాలేదనుకునే బీర్‌లో కూడా వుంది. బీర్‌ని బార్లీ నుండి తయారు చేస్తారు కనుక, ఇదే మంత ప్రమాదకారి కాదని వాదించే వాళ్ళకి మరొక విషయం తెలియదు. బార్లీని ముద్దగా చేసి, దానికి ఒక రకమైన రంగూ, రుచీ, వాసనా కలిగించడం కోసం, టిట్టీ అనే పళ్ళని కలిపి బాగా ఉడక బెడతారు. అలా ఉడికిన మిశ్రమాన్ని వడకట్టి, పులియ బెట్టేందుకు ఈస్ట్‌ని కలుపుతారు. హషీష్ మొదలైన పదార్థాల్లో వుండే మాదక శక్తి టిట్టీ పళ్ళలో కూడా వుంది. కాబట్టే బార్లీలో కలిసినా, బంగారంతో కలిపి తాగినా అది మెదడు మీద చురకలు వేయక మానదు.

అయితే బీర్‌లో ఆల్కహాల్ శాతం తక్కువగా ఉంటుంది కనుక, ఇది అట్టే ప్రభావకారి కాదని, దుష్ఫలితాలు సంభవించవనీ కొందరి అభిప్రాయం. కానీ వాస్తవంగా జరిగేదేమిటంటే, వీరు విస్కీలా బీర్‌ని చిన్న చిన్న పెగ్గుల్లో కాకుండా గ్లాసు




నిండా తీసుకోవడంతో, ఒక పెగ్ విస్కీ చేసే చెడువుని ఒక గ్లాసుడు బీర్ చేయగలుగుతోంది. పన్నెండు ఔన్సులు, అంటే ఓ గ్లాసుడు బీర్‌లో ఉండే పాటే, ఆల్కహాల్ ఒకటింపావు ఔన్సుల విస్కీ పెగ్‌లోనూ వుంది. ఒకరు తాపీగా ఒక పెగ్ విస్కీని చప్పరించే సమయంలో, మరొకరు పన్నెండు ఔన్సుల బీర్‌ని గొంతులో పోసుకోడం ద్వారా, ఆల్కహాల్‌ని ఇద్దరూ సరిసమానంగా రక్తంలోకి పంపిస్తున్నారన్న మాట!

సాధారణంగా మనం తినే ఆహార పదార్థాలు, జీర్ణాశయం చేరుకుని, అక్కడ అరిగిన పదార్థం సారం జీర్ణకోశపు గోడల్లోంచీ రక్తంలో చేరుకుంటుంది. మాదక పదార్థాలకీ, మత్తు పానీయాలకీ జీర్ణ ప్రక్రియ సహాయ సహకారాలతో ఎంత మాత్రం పనిలేదు. గొంతులో జ్వలిస్తూ జారిన ఆల్కహాల్ నేరుగా రక్తాన్ని చేరుకుంటుంది. రక్తంలో కలిసిన నిషాతుషారాలు మెదడును శీఘ్రంగా చేరుకుంటాయి. విచక్షణకే సెలవు ప్రకటించి, బుద్ధి జోకొడతాయి.

విషా తన ప్రభావాన్ని ప్రత్యక్ష త్వరితగతిని చూపిస్తుందని శాస్త్రజ్ఞులు చెబుతున్నారు. గర్భిణీ స్త్రీలు మద్యాన్ని సేవించడం వలన, జన్మించబోయే బిడ్డల అవలక్షణాలకి గురయ్యే ప్రమాదం వుంది. పిల్లలకి పాలిచ్చే తల్లులు, ఆల్కహాల్‌ని తీసుకోడం ద్వారా తమ శిశువులకి అందించే స్తన్యం ద్వారా మమతానురాగాల మాట అటు ంచి, మత్తుని సరఫరా చేస్తున్నట్లు వారు తెలుసుకోలేక పోతున్నారు.

అదే విధంగా వాహనాల్ని నడిపే వారికి కూడా ఆల్కహాల్ ప్రమాదకారే. కొద్ది మోతాదులో సేవించినా సరే, రక్తంలో ఆల్కహాల్ 0.1% మించితే చాలు, వాహనం మీద అదుపును కోల్పోయే ప్రమాదం వుంది. కాబట్టి విస్కీ అయినా బీరైనా మద్యం, మద్యమే. అది ఏ రూపంలో వున్నా, దాని సేవనం కీడునే కలిగిస్తుందని అవశ్యం గుర్తుంచుకోవాలి.

– చైతన్య పవన్